# గోడమీది పిల్లులు

పేపరు చదువుతున్నకొద్దీ సీతారామయ్యకు ఆవేశం హెచ్చసాగింది. కళ్ళు ఎర్రబడుతున్నాయి. ముక్కుపుటాలు ఎగరేస్తున్నాడు, చెమటలు కారుస్తున్నాడు. చేతులు వొణుకుతున్నాయి. గుండెలుకూడా వేగంగా కొట్టుకోసాగాయి. గబగబా పేపరు ఉండలాగా ముడిచి క్రిందకు విసిరేశాడు. కళ్ళజోడు పక్కస్టూలుమీద ముడవకుండానే పెట్టాడు. చేతులు రెండు వెనక వేపు కలిపి, వరండాలో పచారుచేస్తున్నాడు తలొంచుకొని.

నరసమ్మ భోజనంచేసి ఆకులు వేసుకొంటూ నడవాలో కొచ్చింది. భర్త పచారుచేస్తున్నాడు. స్టూలుమీద తీసిచ్చిన ఆకులూ వక్కలూ అట్లానేవున్నయ్.

“అయ్యోరామ! ఆకులు వేసుకోనేలేదేమండీ?” అన్నది నరసమ్మ స్టూలుదగ్గరకు వెళ్ళి సుతారంగా యీనెలు తుంపుతూ. చప్పున ఆమెకొక మహత్తరమయిన ఆలోచన తట్టింది. ఇన్నేళ్ళొచ్చినా ఈమనిషికింకా చిన్నతనం పోలేదేం? ఎల్లకాలము తనే చిలకలుచుట్టి అందిస్తుందా ఏం? అల్లుళ్ళూ, కోడళ్ళూ వచ్చినతరువాతగూడా?

“ఇందా”—

సీతారామయ్య వొకసారి భార్యవేపుచూచి తిరిగి తలొంచుకొన్నాడు. “స్వరాజ్యం-స్వరాజ్యం! అని గుంజుకు చచ్చాంగానీ, ఈ కాంగ్రెసువాళ్ళకంటే, ఆ తెల్లవాళ్ళే

నయం...బీదవాళ్లు బ్రతకడమే అసంభవమయిపోతుంది... గాంధీగారే బ్రతికుంటే...ఆఁ...ఆయన వున్నప్పుడు యింత కంటే ఉద్ధరించి వచ్చిందిమాత్ర మేముంది గనక......" అన్నాడు సీతారామయ్య మెల్లగాకుర్చీలోకూలబడి. భార్య ఆకులకు సున్నంరాసి, కుర్చీకోటిమీద పెట్టింది. ఇంతలోకే పెద్దమ్మాయీ, రంగడూ, చిట్టీ వొచ్చారు వరండాలోకి.

"ఏమయిందండీ యిప్పుడు, నిన్న వాళ్ళ వెంకటేశ్వర్లును పట్టుకెళ్ళారుగా మోలు పోలీసులు" అన్నది నరసమ్మ తమలపాకులు పండినయ్యో లేదో అని నాలికచాపి చూసుకొంటూ.

"ఏమవుతుంది? ఏమీగాదు" అన్నాడు సీతారామయ్య.

"జైల్లో వేస్తారటగా?" అన్నది పెద్దమ్మాయి గోరింటాకు చూసుకొంటూ.

"ఊరికేవెయ్యటంగాదు- ఎముకలు విరిగేటట్టు తంతాకు" అన్నాడు రంగడు. అట్లాంటివిషయాలు రంగడు తన స్నేహితులద్వారా తెలుసుకొన్నాడు.

"అమ్మో! వాళ్ళంతావాయుదూ? వాళ్ళకు వేణ్ణీళ్ళ కాపు ఎవరుకాస్తారు నాన్నా కొట్లో?" అన్నది చిట్టి జైలంటే దానికి సరిగా అర్థంకాలేదింకా.

"ఇంకా కాపుకాయటమేమిటీ నాబొంద - ఒకటే కాపు-తుపాకీకాపు. ఇంకా వాడు బతికి బయటకొస్తాడా?" అన్నాడు సీతారామయ్య.

"మరీ మీదంతా విడ్డూరం. ఇదిగో పులి అంటే అదిగో తోక అంటారు. ఇంతమాత్రానికే కాల్చిపారేస్తారటండీ?" అన్నది సరసమ్మ.

"మరి ఎంతమాత్రానికి కాల్చిపారేస్తారో, ఎంతమాత్రానికి కాల్చిపారేయవొచ్చో నీవు చెప్పు పోనీ-ఈరోజుల్లో మనుషుల్ని కాల్చమంటే, సిగరెట్లు కాల్చినంత తేలికయిపోయింది... దీనికే నువ్వు ఇంతయిదవుతున్నావే, వందలమంది కార్మికులను కాల్చిపారేస్తున్నారు నడివీధుల్లో. మరి వాటికేం చెపుతావు?" అన్నాడు సీతారామయ్య భార్యవేపు చుర చురచూస్తూ-

పెద్దమ్మాయి నోరు తెరిసింది. రంగడు గోక్కోవటం గూడా ఆపి ఆశ్చర్యంగా వింటున్నాడు. చిట్టికి లోలాకు మెలికపడినసంగతిగూడా తెలియలేదు.

"వీళ్ళమ్మ కడుపులు కాలా? కాల్చటానికి చేతులెట్లా వొస్తాయో? వెధవది వంకాయ కుమ్ములో పెట్టాలంటే నా ప్రాణం గిజగిజలాడుతుంది" అన్నది సరసమ్మ.

"ఓరినాయనో! కళ్ళు! బయల్లు కమ్మెవూ ?" అన్నది పెద్దమ్మాయి.

"నేను గట్టిగా కళ్ళు మూసుకుంటాను." అన్నది చిట్టి.

రంగడేమీ పలకలేదు......

"చేతులెట్లావొస్తాయంటున్నది పోలీసులను గురించేనా?...వాళ్ళకొస్తాయి రాకపోయినా వాళ్ళకడుపులు

పొచ్చేటట్లు చేస్తాయి. వాళ్ళ ఉద్యోగమల్లా కాల్చటం. పైఅధికారి ఎవర్ని కాల్చమంటే వాళ్ళను కాలుస్తారు. ఎవర్ని ఎందుకు కాలుస్తున్నామనే ప్రశ్న వాళ్ళకు లేదు. కాల్చటమే పని. వాళ్ళదేం తప్పు? వాళ్ళ నంత రాక్షసంగా తయారుచేసిన వాళ్ళది తప్పుగానీ?"

"సీ రాక్షసం మండిపోను. మరీ యిదేమిటి? వింటుంటేనే వొళ్ళు గగుర్పొడుస్తున్నది." అన్నది నరసమ్మ.

"ఎవర్ని నాన్నా కాల్చేది?" అన్నది చిట్టి. అది ఆమాట అనంగానే అందరికి అదేసందేహం తోచింది. ఇంతకీ ఇంతవరకు కాలిపించుకొనేవాళ్ళెవరో తేలలేదు.

"ఒకళ్ళని సిద్ధాంతమేమిటి? విద్యార్థులు, రాజకీయ నాయకులు, ఆడవాళ్ళు, కార్మికులు, రైతులు" అంటున్నాడు సీతారామయ్య.

"కార్మికులు గూడానా?" అన్నాడు రంగడు. వీడు ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికుల్ని చాలాసార్లు చూశాడు. వాళ్ళను కాల్చవలసినంత అవసరం ఏమొస్తుందో రంగడికి తెలియదు.

"ఇప్పుడు సగంకాల్పులు, వాళ్ళమీదా వాళ్ళతరపు వాదించేవాళ్ళమీదనూ బొంబాయిలో కాల్చారు."

"ఎందుకు?" అన్నది చిట్టి.

"సమ్మెచేశారు" అన్నాడు సీతారామయ్య.

"మరింకేం? పోలీసులుమాత్రం మనుష్యులు గాదంటండీ! వృత్తిపుణ్యానికి కాలుస్తారా వాళ్లమట్టుకు? సమ్మె

చేశాడు గావును- ఈ వెధవలూ; వాళ్ళు కాల్చారు" అన్నది నరసమ్మ తాపీగా.

"అసలు సమ్మె చెయ్యటమెందుకు నాన్నా ?" అన్నది పెద్దమ్మాయి. దానికేమో సమ్మె చెయ్యటమూ, పోలీసులు కాల్చటమూ, దుస్సహంగా వున్నాయి.

"కూడుచాలక — కడుపునిండా తిండికోసం — ఎక్కువ జీతాలిమ్మని కూలీలు అడుగుతారు. యజమానులు యివ్వరు. కూలీలు సమ్మెకడతారు. యజమానులు పోలీసులను పిలిచి కాల్పిస్తారు."

"అప్పుడు గభుక్కున యింట్లోకిలగెత్తి దాక్కోకూడదా నాన్నా ?" అన్నది చిట్టి.

"దాక్కోవచ్చు, కానీ కూలీలకు యిళ్ళుండవు చిట్టీ! చిన్నచిన్న మురికిగుడిసె లుంటాయి."

"అబ్బ! పాడువాసనకొడుతుంటాయి. ఒకసారి వూరునించి వొస్తూవొస్తూ ఆయన చూపించాడు. అంతకంటే పందులగుడిసెలు నయం! యాక్ ఛే ... ధూ" అన్నది పెద్దమ్మాయి.

"మరి అటువంటి గుడిసెల్లో బతకలేక ఎక్కువడబ్బు కావాలనీ, మంచిజీతం కావాలనీ, కూలీలు సమ్మెచేస్తే, యజమానులూ, ప్రభుత్వమూ కలసి కూలీలను మృగాలను కాల్చినట్లు కాల్చి చంపుతారు"

"పీళ్ళముఖాలు దిబ్బేసుకుపోను. ఏం నాలుగు డబ్బులు ఎక్కువిస్తే ప్రాణాలుపోతయ్యా! వాళ్ళ ఉసురు తగిలి చావరూ ?"

"చస్తారు" అన్నది చిట్టి.

"చావాలిసిందే" అన్నాడు రంగడు.

"చావక బాగుపడతారంటలే" అన్నది పెద్దమ్మాయి.

"అయినా కడుపునిండా తిండిలేకపోతే వాళ్ళు మట్టుకు పనేంచేసి చస్తారూ ?" అన్నది నరసమ్మ.

" అందుకనేగా వాళ్ళు సమ్మెలుచెయ్యటం ! " అన్నాడు సీతారామయ్య.

"అటువంటివాళ్ళమీదనా ఈ పోలీసులు కాల్చటం–" అన్నది నరసమ్మ.

ఇంతలోనే చాకలి గుడ్డలుతెచ్చి పడేసి మూలగా నుంచున్నాడు.

"ఏమిట్రా పోలాయ్" అన్నది పెద్దమ్మాయి.

"పచ్చడేమీ మిగల్లేదురా!" అన్నది నరసమ్మ.

"కాస్త లేచి చూడరాదూ ? ఉంటే ఓ పిడచ వెయ్యరాదా ? ... మరీ లేవటానికే చస్తున్నావేం" అని గసిరాడు భార్యను సీతారామయ్య.

"అందుగ్గాదండి" అన్నాడు పోలాయి.

"ఆఁ, పొగాకుతుంపా?"

"కాదండి ! జీతంయిసయమండీ !"

–

"ఏమిటి జీతం ?"

"మీరిచ్చేజీతం చాలటంలేదండీ ! బజార్లో అన్నీ మండిపోతున్నాయండీ !"

"అయితే నువ్వనేదేమిట్రా ?" అన్నది నరసమ్మ.

"యివ్వాడిచ్చేజీతం చాల దమ్మగారూ ! ఎక్కువ చెయ్యాలి ! లేకపోతే మేము బతకలేము" అన్నాడు చాకలి.

"బతకలేకపోతే బండగట్టుకొని భావిలోదూకి చావండి. ఇక్కడ తేరగా డబ్బులు పారబోసుకు కూచోలేదు" అన్నది నరసమ్మ.

"అవన్నీ నీకెందుకోయ్ !" అని భార్యను కోప్పడ్డాడు సీతారామయ్య. "అంతకంటే చిల్లికానీకూడా ఎక్కువయివ్వం పోలన్నా ! నీకు యిష్టమయితేనే ఉతుకు. లేకపోతే మానుకో. ఇంకొకళ్ళచేత వుతికించుకొంటాం."

"సరే అట్లాగే మానుకొంటాంలెండి - కానీ ఎవ్వరూ వుతకరు"

"ఏం?"

"అంతా సంఘంపెట్టుకొని ఒకమాట అనుకున్నామండీ ?"

"మీసంఘం ఉప్పెనగొట్టిపోను — అందరూబిగిస్తే మునిగి చావమంట్రా ?" అన్నది పెద్దమ్మాయి.

సీతారామయ్య మండిపడ్డాడు. నరసమ్మ మండిపడ్డది.

పెద్దమ్మాయి మండిపడ్డది. రంగడు, చిట్టికూడ మండిపడ్డారు. ఈ మంటలకు తాళలేక పోలాయి వెళ్ళిపోయాడు.

"మరి ఈ అలగాజాతికి యిట్టా పుట్టిందేం ? ..." అన్నది సరసమ్మ.

"పాడ్యేకాలం" అన్నది పెద్దమ్మాయి.

"ఇక నా గౌను ఎవరు పుతుకుతారు నాన్నా ?..." అన్నది చిట్టి.

"అమ్మా! నాకొక్క అణాఇవ్వవే సబ్బుతెచ్చి నేనే పుతుక్కుంటాను" అన్నాడు రంగడు.

"మీముఖం, పులికాళ్లే! నిన్న నాజాకెట్లు పుతుక్కునే టప్పటికే గూడలు పులిసిపొయ్యాయి" అన్నది పెద్దమ్మాయి.

"నాచేతులు యింకా మంటపుడుతూనేవున్నాయి" అన్నది సరసమ్మ.

"ఎందుకూ?" అన్నాడు సీతారామయ్య.

"నిన్నటినుంచి పనిమనిషి మానుకుంది. నీళ్ళుతోడు కోనీ, అంట్లుతోముకోనీ, నావొళ్ళు హూనాంహూనాం అయింది" అన్నది సరసమ్మ.

"ఎందుకు మానుకుందీ?"

"చాలటల్లేదట జీతం. ఎక్కువచెయ్యాలట. లేదా పొద్దునపూట కాస్తచద్దెన్నం పెట్టాలట–ఎన్నికూల్సులు— మరీ ఈ పనివాళ్ళను కదిలించటానికి లేకుండావుంది" అన్నది సరసమ్మ.

"పోలీసులు మనమాట వింటారా నాన్నా!" అన్నాడు రంగడు.

"ఎందుకురా?" అన్నది పెద్దమ్మాయి.

"నాకు తెలుసు" అన్నది చిట్టి ఒక్క ఎగురెగిరి.

"మన పోలాయినీ, పనిమనిషినీ కాలిపిద్దాం" అన్నాడు రంగడు.

"ఆఁ, అంతపనీ అయిందాకా వెధవలు వినరు." అన్నది పెద్దమ్మాయి గూడలు వొత్తుకొంటూ.

"లేకపోతే ఏమిటండీ, నిన్నాయివ్వాళా నరాలు తెగిపోతుంటేనూ!" అన్నది నరసమ్మ.

సీతారామయ్య మాటాడలేదు.